RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 185 | ఆగస్టు 05 బుధవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 185 | August 05 Wednesday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |

చురుగ్గా నైరుతి రుతుపవనాలు: హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ 2

## పోలీస్ ఉద్యోగ నియామకాలు

# పకడ్బందీగా జరపాలి

### అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు



**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణలో ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 7,437 పోలీస్ పోస్టుల భర్తీ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. నియామక ప్రక్రియను అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలతో పాటు స్వార్థ ప్రయోజనాలు ఉన్న శక్తులు ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాల నుంచి అందిన కీలక సమాచారంతో సీఎం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. నియమ నిబంధనలకు అనుగుణంగా ఎలాంటి లోపాలకు తావులేకుండా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ సహా ఉన్నతాధికారులను స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాతో పాటు పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. కోచింగ్ సెంటర్లతో పాటు సోషల్ మీడియాలో జరిగే దుష్ప్రచారాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించే దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఖాతాలపై సైబర్ క్రైమ్ విభాగం నిరంతరం కన్నేసి ఉంచాలని వెల్లడించారు. ఈ అత్యవసర సమావేశంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వి.వి.శ్రీనివాస రావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ-20 పెట్రోల్ ఆపేదేలేదు

### పార్లమెంట్‌లో స్పష్టం చేసిన కేంద్రం




**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

దేశవ్యాప్తంగా పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను కలిపి విక్రయించే ఇ-20 (ఙ20) ఇంధన పాలసీ అమల్లో ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ లేవనెత్తిన ప్రశ్నకు పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి లిఖితపూర్వక సమాధానం ఇస్తూ ఈ అంశంపై స్పష్టత ఇచ్చారు. ఈ విధానం అమలు ద్వారా దేశానికి ప్రాథమికంగా మూడు ప్రధాన ప్రయోజనాలు సమకూరుతాయని ప్రభుత్వం పేర్కొంది. మొదటిది, విదేశాల నుంచి ముడి చమురు దిగుమతులపై ఆధారపడటం తగ్గి, భారీగా విదేశీ మారక ద్రవ్యం ఆదా

➤ మిగతా 2వ పేజీలో..

## నగరంలో భారీ కల్తీ మసాలా ముఠా గుట్టురట్టు

### సిట్ దర్యాప్తుకు సీపీ సజ్జనార్ ఆదేశం

**హైదరాబాద్ జనసంఘర్షణ**

హైదరాబాద్ నగరంలో ఆహార కల్తీకి పాల్పడుతున్న రాయిలాపై హెచ్-ఫాస్ట్ అధికారులు చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్ భారీ విజయం సాధించింది. నగరంలోని 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించి, సుమారు 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులతో పాటు 89.15 టన్నుల ముడిపదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు. ఈ వ్యవహారంలో మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్



➤ మిగతా 2వ పేజీలో..

## శ్రీశైలానికి కృష్ణమ్మ పరుగులు

### వేగంగా పెరుగుతున్న నీటిమట్టం

**శ్రీశైలం జనసంఘర్షణ**

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం విపరీతంగా పెరుగుతోంది. గత కొన్ని రోజులుగా కృష్ణమ్మ ఉధృతి క్రమంగా పెరుగుతూ వస్తుండటంతో ప్రాజెక్టు నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. సోమవారం నాటికి జలాశయం నీటిమట్టం 855.5 అడుగులకు చేరుకోగా, నీటి నిల్వ సుమారు 92 టీఎంసీలుగా నమోదైంది. ఇదే ఉధృతి కొనసాగితే నీటిమట్టం అతి త్వరలోనే వంద టీఎంసీల మార్కును దాటుతుందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కర్ణాటకలోని ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులతో పాటు భీమా నది నుంచి



➤ మిగతా 2వ పేజీలో..

## ఒప్పందానికి రాకపోతే కఠిన చర్యలు

### ఇరాన్‌కు డోనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక:

**టెహ్రాన్ జనసంఘర్షణ**

ఇరాన్ నాయకత్వంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తమతో చర్చలు జరిపి ఒప్పందం చేసుకోవాలని, లేదంటే లొంగిపోవాల్సిందేనంటూ స్పష్టమైన అల్టిమేటం జారీ చేశారు. ఇరాన్ వైఖరి మోసపూరితంగా ఉందన్న ట్రంప్, ఆ దేశం

➤ మిగతా 2వ పేజీలో..




## తమిళనాట రాజకీయ రచ్చ

### నటి త్రిషపై వ్యాఖ్యల కేసులో ఉదయనిధి అరెస్ట్, ఆపై విడుదల

**చెన్నై జనసంఘర్షణ**

కావేరి నదీ జలాల అంశంపై తంజావూరులో జరిగిన నిరసన ప్రదర్శన సందర్భంగా సినీ నటి త్రిషను ఉద్దేశించి డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు తమిళనాడు రాణణలో విజరు ప్రభుత్వం

➤ మిగతా 2వ పేజీలో..



# ఈ-20 పెట్రోల్ ఆపేదేలేదు

**మొదటిపేజీ తరువాయి..** అవుతుంది. రెండవది, చెరకు, మొక్కజొన్న వంటి పంటల నుంచి ఇథనాల్ తయారీ పెరగడం వల్ల రైతులకు అదనపు మార్కెట్ లభించి వారి ఆదాయం పెరుగుతుంది. మూడవది, ఈ ఇంధనం వల్ల కార్బన్ ఉద్గారాలు తగ్గి పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని కేంద్రం వివరించింది. పాత వాహనాల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకుని ఈ ఇ-20 ఇంధన వినియోగాన్ని దశలవారీగా వేగవంతం చేస్తున్నట్లు స్పష్టం చేసింది.

## కొత్త టారిఫ్‌ల నిర్ణయంపై ఆ దేశంలో తీవ్ర నిరసన

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన కొత్త టారిఫ్‌ల నిర్ణయంపై ఆ దేశంలో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 60 భాగస్వామ్య దేశాల నుంచి దిగుమతయ్యే వస్తువులపై 10 శాతం నుంచి 12.5 శాతం వరకు విధించిన కొత్త సుంకాలను సవాలు చేస్తూ డెమోక్రటిక్ నేతృత్వంలోని 25 రాష్ట్రాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. న్యూయార్క్‌లోని 'యూఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్'లో దాఖలైన ఈ పిటిషన్‌లో, ట్రంప్ ప్రభుత్వం తన చట్టబద్ధమైన అధికార పరిమితులను దాటి వ్యవహరిస్తోందని, ప్రజలు మరియు వ్యాపార సంస్థలపై అదనపు భారం వేస్తోందని రాష్ట్రాలు ఆరోపించాయి. వెట్టి చాకిరీ నిరోధక చట్టాల అమలును నెపంగా చూపిస్తూ ఈ కొత్త సుంకాలను విధించినప్పటికీ, దాన్ని భారత్ తీవ్రతరం చేయడంతో ప్రారంభంలో ప్రతిపాదించిన 12.5 శాతం పన్నును 10 శాతానికి తగ్గించారు. చమురు, సహజ వాయువు, ఎరువులు మరియు యూఎస్-మెక్సికో-కెనడా వాణిజ్య ఒప్పందం కిందకు వచ్చే వస్తువులకు ఈ పన్నుల నుంచి మినహాయింపు ఇచ్చారు. గతంలో కూడా ట్రంప్ విధించిన పలు సుంకాలు కోర్టుల ద్వారా చిక్కుల్లో పడగా, ప్రస్తుతం 25 రాష్ట్రాలు దాఖలు చేసిన ఈ ఉమ్మడి పిటిషన్ ట్రంప్ వాణిజ్య విధానాలకు మరో పెద్ద సవాలుగా మారనుంది.

## చురుగ్గా నైరుతి రుతుపవనాలు: హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్

నైరుతి రుతుపవనాల చురుకైన కదలికల ప్రభావంతో హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు హైదరాబాద్ నగరానికి ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉంటుందని, పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలు ఉన్నాయని తెలిపింది.

క్యుములోనింబస్ మేఘాల ప్రభావం వల్ల ఇప్పటికే ఉత్తర తెలంగాణతో పాటు హైదరాబాద్‌లో భారీ వర్షం నమోదు కాగా, అత్యధికంగా కామారెడ్డి జిల్లాలో 18.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిసినట్లు అధికారులు వెల్లడించారు.

## పొగాకు రైతుల కోసం అంటూ..జగన్ రాజకీయం

### తక్కువ ధరక బియ్యం పంపిణీ కార్యక్రమంలో మంత్రి దుర్గేశ్

**ఏలూరు :** తన ఉనికిని కాపాడుకోవడానికి జగన్ పొగాకు రైతుల కోసం అంటూ రాజకీయ యాత్ర చేపడుతున్నారని మంత్రి కందుల దుర్గేశ్ విమర్శించారు. నిడదవోలు తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో తక్కువ ధరకు బియ్యం పంపిణీ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద ప్రజలకు కూడా తక్కువ ధరకు నాణ్యమైన బియ్యం అందిస్తున్నా మన్నారు. గత ప్రభుత్వంలో సన్న బియ్యం ఇస్తామని చెప్పి అవి అడిగితే బూతులు తిట్టిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఇది రైతు ప్రభుత్వమని... ధాన్యం కొనుగోలు చేసిన గంటల్లోనే నగదు జమ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు ఎప్పుడైనా గిట్టుబాటు ధర ఇచ్చారా అంటూ ఆయన ప్రశ్నించారు. మంత్రి దుర్గేశ్ స్వయంగా తూకం వేసి బియ్యాన్ని ప్రజలకు అందించారు. కార్యక్రమంలో డీఎస్ఓ పార్వతి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, తహసీల్దార్ నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా

### 12మంది ప్రయాణికులకు గాయాలు

**ఏలూరు :** ఉంగుటూరు మండలం తేలప్రోలు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చెన్నై నుంచి విశాఖపట్నం వైపు సుమారు 25 మందికి పైగా ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు తేలప్రోలు సమీపానికి చేరుకోగానే అదుపుతప్పి రోడ్డుకు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సుమారు 12 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు కాగా, మరికొందరికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్సులో సమీప ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సు వెనుక నుంచి వస్తున్న ఓ ఆయిల్ ట్యాంకర్ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో అతడిని కూడా చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఆయిల్ ట్యాంకర్‌లో సుమారు 400 లీటర్ల డీజిల్ ఉంది. ఈ డీజిల్ ట్యాంక్‌కి షార్ట్ సర్క్యూట్ అయ్యి ఉంటే ప్రమాద స్థాయి తీవ్రంగా ఉండేది. సమాచారం అందుకున్న గన్నవరం డీఎస్పీ ధర్మేంద్ర, హనుమాన్ జంక్షన్, ఆత్కూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

-------

# శ్రీశైలానికి కృష్ణమ్మ పరుగులు

**మొదటిపేజీ తరువాయి..** భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగింది. దాంతో అక్కడ నుంచి లక్షలాది క్యూసెక్కుల నీటిని దిగువనున్న శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ ప్రవాహం మరో నాలుగు రోజులకు పైగానే కొనసాగే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు వెల్లడించారు. మరోవైపు తుంగభద్ర జలాశయానికి కూడా క్రమంగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో తాగునీటి అవసరాలకు అనుగుణంగా నీటిని కాలువలకు వదులుతున్నారు. అలాగే నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ వద్ద కూడా ప్రస్తుతం ప్రవాహాలు నిలకడగా కొనసాగుతున్నాయి. శ్రీశైలానికి వస్తున్న వరద తీవ్రత దృష్ట్యా ప్రాజెక్టు వద్ద అధికారులు అప్రమత్తమై నీటిమట్టాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# నగరంలో భారీ కల్తీ మసాలా ముఠా గుట్టురట్టు

**మొదటిపేజీ తరువాయి..** పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న ఈ కల్తీ రాయిాలపై సమగ్ర దర్యాప్తు కోసం ప్రత్యేక సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ ప్రకటించారు. జీలకర్ర, వాము, లవంగం, షాజీరా, ఆవాలు వంటి నిత్యం వాడే మసాలా దినుసులకు ఆకర్షణీయమైన రంగు, మెరుపు తీసుకురావడానికి ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్, టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ కలర్స్, రైస్ బ్రాన్ ఆయిల్ వంటి ప్రమాదకర రసాయనాలను వినియోగిస్తున్నట్లు తనిఖీల్లో తేలింది. ఇటువంటి పదార్థాల వల్ల క్యాన్సర్, అలర్జీలు, జీర్ణ సమస్యలతో పాటు కాలేయం, మూత్రపిండాలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదముందని కమిషనర్ హెచ్చరించారు. హెచ్-ఫాస్ట్ బృందం ఏర్పడిన 140 రోజుల్లోనే 659 ప్రాంతాల్లో తనిఖీలు చేసి 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడమే కాకుండా 246 టన్నుల కల్తీ ఆహారాన్ని స్వాధీనం చేసుకుందని వివరించారు. అనుమానాస్పద ఆహార పదార్థాలపై ప్రజలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## తెలంగాణలో వర్షాలు పడకుండా క్షుద్రపూజలు

### మాజీమంత్రి హరీష్ రావుపై పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ ఆరోపణలు

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీశ్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో వర్షాలు పడకూడదని, కరువు రావాలని కోరుకుంటూ ఆయన క్షుద్ర పూజలు చేశారని మహేశ్ గౌడ్ ఆరోపించారు. అందుకు తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అరుంధతి సినిమా తరహాలో ఆయన పూజలు నిర్వహిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ఈ ఏడాది మార్చి 2న తమిళనాడులోని తిరుచ్చికి, జూన్ 1న కర్ణాటకలోని శివమొగ్గకు వెళ్లారని.. ఆ తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు వివరించాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు.తిరుపతికి వెళ్లినప్పుడు మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. అఘోరీ ఆలయానికి వెళ్లిన విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం దేవుడిని ప్రార్థించడం సహజమని.. కానీ మాజీ మంత్రి మాత్రం ప్రజలకు కీడు జరగాలని పూజలు చేశారని విమర్శించారు. తన రాజకీయ స్వార్థం కోసమే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై నిజాలు బయటపెట్టినందుకే అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌లకు లీగల్ నోటీసులు పంపించారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అయితే లీగల్ నోటీసులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అఘోరాలతో క్షుద్ర పూజలు చేశారనే ప్రచారం గతంలో జరిగిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చెప్పారు. ఇప్పుడు హరీశ్ రావుపై వస్తున్న ఆరోపణలతో కేసీఆర్ పూజలు కూడా నిజమేనని అనిపిస్తోందన్నారు. యాదగిరిగుట్టకు వెళ్లి పొర్లు దండాలు పెట్టి మరీ ఏం చేశారో ప్రజలకు హరీశ్ రావు చెప్పాలని ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. గతంలో మంత్రాలు, తంత్రాల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన ఘటనలు ఉన్నాయని, దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఇలాంటి ఆచారాలను బలంగా నమ్ముతారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

## నిమ్స్‌లో చికిత్స పొందుతున్న యువతి పట్ల అసభ్య ప్రవర్తన

### అటెండర్ తీరుపై పోలీసులకు ఫిర్యాదు

**హైదరాబాద్ :** నగరంలోని పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో దారుణం జరిగింది. రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స కోసం వచ్చిన యువతిపై ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించడం కలకలం రేపుతోంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రమాదంలో యువతికి రెండు కాళ్లు విరగడంతో ఆమెను కుటుంబసభ్యులు నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న సమయంలో తెల్లవారుజామున 3 గంటల నుంచి 4 గంటల మధ్యలో పక్క బెడ్‌లో ఉన్న మరో రోగి అటెండెంట్ యువతిపై అసభ్యంగా ప్రవర్తించాడు. వ్యక్తి తీరుతో యువతి తీవ్ర భయాందోళనకు గురైంది. వెంటనే జరిగిన విషయాన్ని యువతి మరుసటి రోజు తన కుటుంబ సభ్యులకు తెలియజేసింది. ఈ విషయంపై యువతి తండ్రి, ఆర్ఎంపీ వైద్యుడు.. పోలీసులను ఆశ్రయించారు. యువతి తండ్రి, బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి

# ఒప్పందానికి రాకపోతే కఠిన చర్యలు

**మొదటిపేజీ తరువాయి..** ఒకవైపు దౌత్య మార్గాల కోసం విజ్ఞప్తి చేస్తూనే మరోవైపు బహిరంగంగా చర్చలకు నిరాకరిస్తోందని మండిపడ్డారు. హోర్ముజ్ జలసంధిపై తమకే పూర్తి నియంత్రణ ఉందని ఇరాన్ చేస్తున్న వ్యాఖ్యలను తోసిపుచ్చిన ఆయన, ఆ ప్రాంతం ప్రస్తుతం అమెరికా రక్షణ వ్యవస్థ నియంత్రణలోనే ఉందోనని స్పష్టం చేశారు. అలాగే, ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని సమకూర్చుకోలేదని తేల్చి చెప్పారు. మరోవైపు పశ్చిమాసియాలో శాంతి నిమిత్తం పెట్టిన షరతులకు ఇరాన్ అంగీకరించకపోవడంతో, అమెరికా సెంట్రల్ కమాండ్ (జజుచీజూవీ) తమ బలగాలకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. టెహ్రాన్‌పై ఒత్తిడి పెంచి ఒప్పందానికి తీసుకురావడానికి అవసరమైన వినూత్న, సంప్రదాయేతర సైనిక వ్యూహాలను రూపొందించాలని ఆర్మీ విశ్లేషకులను కోరినట్లు సమాచారం. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ తో పాటు ఇతర ప్రాంతీయ నాయకుల విజ్ఞప్తి మేరకు ట్రంప్ తాత్కాలికంగా దాడులను నిలిపివేసినప్పటికీ, ఇరాన్ ఈ అవకాశాన్ని వాడుకోకపోతే తీవ్ర ఫలితాలు ఉంటాయని హెచ్చరించారు. ఇదే సమయంలో కువైట్, ఇరాక్‌లలోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ఐఆర్‌జీసీ డ్రోన్ దాడులకు పాల్పడటంతో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి.

# తమిళనాట రాజకీయ రచ్చ

**మొదటిపేజీ తరువాయి..** నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఉదయనిధి విమర్శిస్తున్న సమయంలో, కార్యకర్తల నినాదాల మధ్య ఆయన నటిని ఉద్దేశించి ద్వంద్వార్థంలో అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు, చెన్నైలోని ఆయన నివాసం నుంచి అదుపులోకి తీసుకుని సెంగిపట్టి పోలీస్ స్టేషన్‌లో విచారించారు. అయితే, డీఎంకే మద్రాస్ హైకోర్టును ఆశ్రయించడంతో, ఉదయనిధిని వెంటనే విడుదల చేయాలని మరియు ఆయనపై తదుపరి బలవంతపు చర్యలు తీసుకోవద్దని కోర్టు ఆదేశించింది. తాను మాట్లాడిన వ్యాఖ్యలు కావేరి నదికి సంబంధించినవేనని ఉదయనిధి వివరణ ఇచ్చినప్పటికీ, ఇతర రాజకీయ పక్షాల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ వ్యాఖ్యలను 'అసహ్యకరమైనవి' అని అభివర్ణించిన టీవీకే (ఎఖ) నాయకులు, ఇది డీఎంకే దిగజారుతున్న రాజకీయ ప్రమాణాలకు నిదర్శనమని మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ (భాజపా) నేతలు కూడా ఈ తీరును ఖండించారు. మరోవైపు, ఈ అంశంపై టీవీకే పార్టీ జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తూ, ఉదయనిధి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది.

## సౌర విద్యుత్ కనెక్షన్లకు ప్రాధాన్యం

### విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**అమరావతి :** సౌర విద్యుత్ ద్వారా లక్షలాది కనెక్షన్ల లక్ష్యంతో ముందుకు వెళు తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రైతులకు పెద్ద ఎత్తున వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నామని చెప్పారు. భారీగా రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు.

విద్యుత్ రంగంపై ప్రభుత్వం ఇప్పటికే శ్వేతపత్రం విడుదల చేసిందని మంత్రి అన్నారు. పవర్ సెక్టార్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో పూర్తి వివరాలు ప్రజలకు తెలియజేశామన్నారు. వైసీపీ హయాంలో విద్యుత్ వ్యవస్థ నిర్వీర్యం చేశారని విమర్శించారు. అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు వల్ల నష్టాలు జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టామని తెలిపారు. గత ఏడాది కొంతమేర విద్యుత్ ఛార్జీలు తగ్గించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు కొనసాగుతోందని వెల్లడించారు. ట్రాన్స్‌మిషన్ లైన్ల విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజల నుంచి వినతులు వచ్చాయని.. రెవెన్యూ, భూ, విద్యుత్, పెన్షన్ సమస్యలపై వినతులను స్వీకరించామన్నారు. జిల్లా కలెక్టర్లు, అధికారులు, ఎస్పీలతో సమన్వయం చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అందిన అర్జీలన్నింటినీ త్వరితగతిన పరిష్కరిస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చారు.

## దివ్యాంగులకు గుడ్ న్యూస్

### వాట్సాప్ ద్వారా సదరం సర్టిఫికెట్ల డౌన్‌లోడ్

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. దివ్యాంగులకు సదరం సేవలు మరింత చేరువ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌లో భాగంగా ఈ సేవలను అందించేందుకు చంద్రబాబు సర్కార్ అడుగులు వేసింది. ఈ మేరకు రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కీలక వివరాలను వెల్లడించింది. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సదరం సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించినట్లు ఆర్టీజీఎస్ పేర్కొంది. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 9552300009కు 'హాయ్' అని మెసేజ్ పంపాలని, అనంతరం సదరం సేవలను ఎంపిక చేసుకోవాలని సూచించింది. మనమిత్ర ద్వారా దివ్యాంగులు సదరం స్లాట్ బుక్ చేసుకోవచ్చని, అలాగే స్లాట్ లభ్యతను తెలుసుకోవచ్చని తెలిపింది. అదేవిధంగా సర్టిఫికెట్లను కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించింది. ఈ సదుపాయాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కోరింది.

# యువతే దేశానికి వెన్నుముక.. గ్రామీణ యువతకు ఉచిత క్రికెట్ కిట్ల పంపిణీ

- బిజెపి బాన్సువాడ నియోజకవర్గం ఇంచార్జ్ ఎన్నారై కోనేటి శశాంక్

అక్బర్‌నగర్/, ఆగస్టు 4/( జన సంఘర్షణ)

యువత దేశానికి వెన్నుముక అని, వారిలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని కోనేరు శశాంక్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆలపాటి హరికృష్ణ అన్నారు. గ్రామీణ ప్రాంతాల యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా క్రికెట్ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం అక్బర్‌నగర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక యువతకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆలపాటి హరికృష్ణ మాట్లాడుతూ, నేటి యువత ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లకే పరిమితమై క్రీడలకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. క్రీడలు శరీర దారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, చిన్ననాటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే జీవితంలో పట్టుదల, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం అలవడతాయని చెప్పారు. క్రీడా పోటీల్లో గెలుపు-ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని చాటాలని, ఏ రంగంలోనైనా విజయాన్ని అందుకోవాలంటే నిరంతర సాధనే విజయానికి మూలమని యువతకు సూచించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు ఆలపాటి హరికృష్ణను అక్బర్‌నగర్ యూత్



సభ్యులు మొహమ్మద్ లోఖ్మాన్ రఫీ శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో థామస్, మద్దిరెడ్డి రాజేష్, పత్తి సతీష్, షేక్ ఈసా, మొహమ్మద్ అల్తాఫ్, మొహమ్మద్ ఇర్ఫాన్, ఆసిఫ్, లోఖ్మాన్ రఫీ, ఆఫ్జల్ తదితరులు పాల్గొన్నారు

# సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను విజయవంతం చేయండి

- నాయకుల పిలుపు

హైదరాబాద్/ఆగస్టు 4/(జన సంఘర్షణ)

తెలంగాణలో సామాజిక న్యాయం, సమాన హక్కులు, సమాన అవకాశాల సాధనే లక్ష్యంగా ఆగస్టు 6, 2026న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహించనున్న లి"సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ"లిను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలోని ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తెలంగాణ రక్షణ సేన కట్టుబడి పనిచేస్తోందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. అలాగే, "సామాజిక న్యాయ తెలంగాణ" లక్ష్య సాధన దిశగా ఈ సంకల్ప సభ ఒక కీలక మైలురాయిగా నిలవనుందని, తెలంగాణ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే చారిత్రాత్మక వేదికగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సభ విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొంటూ.. రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు, యువత, మహిళలు, కార్మికులు, రైతులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సోదర సోదరీమణులు భారీ సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. "సమాన హక్కులు – సమాన అవకాశాలు – సామాజిక న్యాయమే తెలంగాణ అభివృద్ధికి బాట" అనే సందేశంతో నిర్వహిస్తున్న ఈ సంకల్ప సభకు ప్రజలందరూ స్వచ్ఛందంగా




తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# సిద్ధాపూర్‌లో పంచాయతీ ట్రాక్టర్‌తో ఇసుక అక్రమ రవాణా?

- గ్రామస్తుల ఆరోపణలు.. వీడియోలు వైరల్

బోధన్, /ఆగస్టు 4/(జన సంఘర్షణ)

బోధన్ మండలం సిద్ధాపూర్ గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను ఇసుక అక్రమ రవాణాకు వినియోగిస్తున్నారని గ్రామస్తులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. గ్రామపంచాయతీలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని చెబుతున్న స్థానికులు, తాజాగా పంచాయతీ ట్రాక్టర్‌తో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలించారని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను గ్రామంలో చెత్త సేకరణ, తాగునీటి ట్యాంకుల నిర్వహణ వంటి ప్రజా అవసరాలకే వినియోగించాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రజాప్రతినిధి భర్త ఆధ్వర్యంలో



ఇసుక రవాణాకు ఉపయోగించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను కొందరు స్థానికులు వీడియోలుగా చిత్రీకరించి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. గ్రామ ప్రజల ఆస్తిగా ఉన్న పంచాయతీ వాహనాలను వ్యక్తిగత అవసరాలకు లేదా అక్రమ కార్యకలాపాలకు వినియోగిస్తే అది ప్రజాధన దుర్వినియోగమేనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు వెంటనే దర్యాప్తు నిర్వహించి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావడంతో పాటు తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా ఆస్తి ప్రజల కోసమే. అధికార.... యంత్రాంగం అప్రమత్తమై ఇలాంటి ఆరోపణలపై పారదర్శక విచారణ చేపట్టి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# క్వార్టర్ బాటిల్‌పై రూ.15-30 అదనపు వసూళ్లు..?

- కారేపల్లిలో మద్యం విక్రయాలపై వినియోగదారుల ఆందోళన
- ఆకస్మిక తనిఖీలు చేపట్టి వాస్తవాలు వెలుగులోకి తేవాలని డిమాండ్
- ఎంఆర్పీ కంటే అధిక ధర చెల్లించొద్దని ప్రజలకు అవగాహన

సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్

కారేపల్లి ప్రాంతంలోని పలు మద్యం దుకాణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్పీ) కంటే ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ.15 నుంచి 30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రతిరోజూ మద్యం కొనుగోలు చేసే వినియోగదారులపై అదనపు భారం పడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి మద్యం సీసాపై గరిష్ఠ చిల్లర ధరను స్పష్టంగా ముద్రించినప్పటికీ, కొన్ని దుకాణాల్లో ఆ ధరకు విక్రయించడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఒకటి, రెండు దుకాణాలకే పరిమితం కాకుండా పలు చోట్ల ఒకే తరహా పరిస్థితి కనిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఆబ్కారీ శాఖ సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని కోరుతున్నారు. రోజుకు వందల సంఖ్యలో క్వార్టర్ బాటిళ్లు విక్రయమవుతున్న నేపథ్యంలో ఒక్కో బాటిల్‌పై రూ.15 నుంచి 30 వరకు అదనంగా వసూలు చేస్తే భారీ స్థాయిలో అక్రమ వసూళ్లు జరిగే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనల అమలును కట్టుదిట్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.


**వినియోగదారులకు సూచన**

మద్యం కొనుగోలు చేసిన తర్వాత సీసాపై ముద్రించిన ఎంఆర్పీని పరిశీలించి, అదే ధరను మాత్రమే చెల్లించాలని వినియోగదారులకు సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు. ఎంఆర్పీ కంటే అధికంగా డబ్బులు కోరితే కారణం ఏమిటని ప్రశ్నించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే





ఎక్కువ చెల్లించాల్సిన అవసరం లేదని అవగాహన కల్పించాలని కోరుతున్నారు. అవసరమైతే బిల్లు తీసుకుని సంబంధిత ఆబ్కారీ అధికారులకు




ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

**చట్టం ఏమి చెబుతోంది?**

ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ చిల్లర ధర కంటే అధికంగా వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధం. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడం, లైసెన్స్‌ను తాత్కాలికంగా నిలిపివేయడం లేదా రద్దు చేయడం వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కారేపల్లి ప్రాంతంలోని మద్యం దుకాణాలపై ఖమ్మం జిల్లా ఆబ్కారీ శాఖ ప్రత్యేక దృష్టి సారించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, వినియోగదారులకు ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్పీ ధరకే మద్యం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# అంబం విద్యార్థుల సమస్యకు తక్షణ పరిష్కారం..

- సర్పంచ్ చొరవతో బస్సు సమయాల్లో మార్పు

వర్ని అంబం,/ ఆగస్టు 4/(జన సంఘర్షణ)



అంబం గ్రామం నుంచి బోధన్‌కు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సు సమయాల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాశాలలు సాయంత్రం 4 గంటలకు ముగిసినా, సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు రాత్రి 7 గంటల వరకు ఇంటికి చేరాల్సి వస్తోందని గ్రామ సర్పంచ్ కూర్లేపు గంగాధర్ దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థుల సమస్యను వెంటనే గుర్తించిన సర్పంచ్ గంగాధర్, బోధన్ డిపో మేనేజర్‌కు ఫోన్ ద్వారా పరిస్థితిని వివరించి, విద్యార్థుల ఇబ్బందులను తెలియజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీఎం, విద్యార్థులకు అనుకూలంగా బస్సు సమయాలను మార్చి, సమయానికి ఇంటికి చేరుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన సర్పంచ్ కూర్లేపు గంగాధర్‌కు, అలాగే విద్యార్థుల అభ్యర్థనను సానుకూలంగా స్వీకరించిన బోధన్ డీఎంకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను వెంటనే గుర్తించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ పరిష్కారం చూపిన సర్పంచ్ చొరవ గ్రామ ప్రజలకు ఆదర్శంగా నిలిచిందని పలువురు అభినందించారు.

# బొప్పాపూర్ గ్రామంలో భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా బోనాల పండుగ

రుద్రూర్ మండలం,/ ఆగస్టు 4:/(జన సంఘర్షణ)



రుద్రూర్ మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో మంగళవారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించగా, గ్రామమంతా భక్తిమయ వాతావరణంతో కళకళలాడింది. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు తలపై బోనాలు ఎత్తుకుని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలను సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామ ప్రజలు కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొని భక్తి, ఐకమత్యం, సాంప్రదాయాల పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ నరోజీ గంగారాం, సుమలత కృష్ణ, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పట్ల సురేష్, బాపూజీ లింగం, సురేందర్ తదితర ప్రముఖులు పాల్గొని గ్రామ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు. బొప్పాపూర్‌లో నిర్వహించిన ఈ బోనాల వేడుకలు భక్తి, సంప్రదాయం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచి గ్రామ ప్రజలను ఆనందోత్సాహాల్లో ముంచెత్తాయి. ఈ కార్యక్రమం తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్య బాలకృష్ణ జన్మదినం సందర్భంగా ఘనంగా ఔషధ మొక్కల దినోత్సవం



రుద్రూర్,/ ఆగస్టు 4/ (జన సంఘర్షణ)

ఆధునిక ఆయుర్వేద శిరోమణి ఆచార్య బాలకృష్ణ 55వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రుద్రూర్ మండల కేంద్రంలోని పతంజలి యోగ మరియు ధ్యాన కేంద్రంలో మంగళవారం ఔషధ మొక్కల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహర్షి పతంజలి యజ్ఞ సహిత యోగ, ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 4న నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 5:30 నుంచి 6:30 గంటల వరకు యజ్ఞం, యోగ సాధన నిర్వహించి, అనంతరం వివిధ రకాల ఔషధ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఆచార్య బాలకృష్ణ లక్షలాది ఆయుర్వేద వనమూలికలపై పరిశోధనలు చేసి, ప్రాణాంతక వ్యాధులను నివారించే శక్తి ప్రకృతి ప్రసాదించిన ఔషధ మొక్కల్లోనే దాగి ఉందని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడని కొనియాడారు. ఆయన 55వ జన్మదినాన్ని పురస్కరించుకుని లితిప్పతీగ (అమృతవల్లి/గిలోయ్)లికు చెందిన 55 ఔషధ మొక్కలను గ్రామ ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం గోశాలలో గోవులకు మేత, దాణా అందించి గోసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశ్వనాథ్ మహాజన్, రుద్రూర్ మండల అధ్యక్షులు పుట్టి సాయిబాబా, యువభారత్ అధ్యక్షులు గబాలే పురుషోత్తం, బీఎస్టీ బోధన్ డివిజన్ అధ్యక్షులు బెజుగం వెంకటేశం గుప్త, ఆత్మల హన్మాండ్లు, తోట్ల గంగారాం, వంద పోశెట్టి, సత్యనారాయణ, గోసేవకులు మరియు పతంజలి కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రకృతి పరిరక్షణతో పాటు ఆయుర్వేద ఔషధ మొక్కల పెంపకాన్ని ప్రతి ఇంటి బాధ్యతగా స్వీకరించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# వర్నిలో "మన ఊరు - మన భద్రత" అవగాహన సదస్సు!

వర్ని/ఆగస్టు 4/(జన సంఘర్షణ)

వర్ని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "మన ఊరు – మన భద్రత – మన బాధ్యత" అవగాహన సదస్సు. ప్రజా సహకారంతోనే సురక్షిత సమాజం సాధ్యమన్న బిఆర్ఎస్ నాయకులు. వర్ని మండల కేంద్రం లో మన ఊరు – మన భద్రత గమన బాధ్యత కార్యక్రమం. వర్ని పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో




నిర్వహించిన "మన ఊరు – మన భద్రత – మన బాధ్యత" అవగాహన సదస్సు. ప్రజల్లో భద్రతపై అవగాహన పెంపొందించడం, చట్టాల పట్ల గౌరవం, సామాజిక బాధ్యతను గుర్తు చేసే ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అభినందనీయం అని పాల్గొన్న నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో దీ=హా పార్టీ వర్ని మండల నాయకులు వైఎస్ దాస్, ఫహీం లు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించిన పోలీస్ వారిని అభినందించారు. ప్రజల సహకారంతోనే సురక్షితమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలియజేసారు.

జన సంఘర్షణ

బుధవారం
05 ఆగస్టు 2026

# పోతంగల్‌లో అంగరంగ వైభవంగా బోనాల పండుగ

పోతంగల్/ ఆగస్టు4/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల పరిధిలోని పోతంగల్ మండల కేంద్రంలో మంగళవారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామమంతా పండుగ శోభను సంతరించుకోగా, మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో తలపై బోనాలు ఎత్తుకుని డప్పు వాయిద్యాలు, బజా-భజంత్రీల నడుమ ఉత్సాహంగా ఊరేగింపుగా గ్రామదేవత ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. "జై అమ్మవారి" నినాదాలతో గ్రామమంతా భక్తిమయ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సంధ్య హనుమంతులు, మాజీ ఎంపీటీసీ కేశ వీరేశం, మాజీ ఎంపీపీ గంధపు పవన్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, ఈ వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సాగు చేసిన పంటలు పుష్కలంగా పండాలని, గ్రామంలో సుభిక్షం నెలకొనాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి పండుగలు గ్రామాల్లో ఐక్యతను, భక్తి భావాన్ని మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక అలంకరణలు, దీపారాధనలు, హారతులతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. చిన్నారులు, యువత సంప్రదాయ నృత్యాలు, కోలాటాలతో పండుగకు మరింత కళ తీసుకొచ్చారు. డప్పు చప్పుళ్లు, బజా-భజంత్రీల సందడి మధ్య సాగిన బోనాల ఊరేగింపు గ్రామ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంధపు పవన్, వడ్ల సంజు, వడ్ల దత్తు, పబ్బ శేఖర్, క్రేశ్ క్రాంతి, సాయ గౌడ్ వైన్స్, గాండ్ల గజ్జు, మునిం సాయిలు బాస్వంత్, గంధపు రాజు, బజరంగ్





దత్తు, గంట్ల విట్టల్, కాశ గౌడ్, వీరు, గుండ్ల భూమన్న, మహిళలు, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల పండుగను విజయవంతం చేశారు.

# హంగార్గ గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా బోనాల పండుగ

పోతంగల్/ఆగస్టు 4/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల పరిధిలోని హంగార్గ గ్రామంలో బోనాల పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో తలపై బోనాలు ఎత్తుకుని బజంత్రీల నడుమ గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా గ్రామదేవత ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామమంతా భక్తి పారవశ్యంతో కళకళలాడింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గంగాధర్ మాట్లాడుతూ.. ఈ వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల పంటలు పుష్కలంగా పండాలని, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,



సుఖశాంతులతో జీవించాలని గ్రామదేవతలను మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్ ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కాంగ్రెస్ డైనమిక్ లీడర్ యంగ్ నీరడి ఉదయభాస్కర్ సహకారంతో జరిగిన ఈ వేడుకల్లో...గ్రామ పెద్దలు, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల జైజైధ్వానాలు, డప్పు వాయిద్యాలు, బజంత్రీల నాదాలతో గ్రామం పండుగ శోభను సంతరించుకుంది. హంగార్గ గ్రామ ప్రజల ఐక్యత, భక్తి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన ఈ బోనాల పండుగను గ్రామస్థులు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామంలో సుభిక్షం, సంతోషం నెలకొనాలని ప్రతి ఒక్కరూ ఆకాంక్షించారు. అవసరమైతే దీనికి మరింత ఆకట్టుకునే ఉపశీర్షిక ఈ కార్యక్రమంలో, ఏఎంసీ చైర్మన్, నీరడ్డి గంగాధర్, ఉప సర్పంచ్ గోపి ,సందీప్, సుభాష్, రవి, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# కోకాపేటలో పుంజాల శివశంకర్ విగ్రహ స్థల పరిశీలన..


❑ ఘనంగా ఆవిష్కరణకు పిలుపు

హైదరాబాద్/, ఆగస్టు 4/(జన సంఘర్షణ)

కోకాపేటలో నిర్మాణంలో ఉన్న మున్నూరు కాపు ఆత్మగౌరవ భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న స్వర్గీయ పుంజాల శివశంకర్ గారి విగ్రహ స్థలాన్ని మున్నూరు కాపు ఆత్మగౌరవ మహా ధర్నా సేన రాష్ట్ర కన్వీనర్ ఉగ్గె శ్రీనివాస్ పటేల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కోకాపేట బీసీ భవన్ ప్రాంతంలోని సర్కిల్ రోడ్డుకు "స్వర్గీయ పుంజాల శివశంకర్ మార్గ్", అక్కడి జంక్షన్‌కు "పుంజాల శివశంకర్ జంక్షన్" అని పేరు



పెట్టేలా కృషి చేస్తామని ప్రకటించారు. బీసీ వర్గాల హక్కుల సాధన కోసం విశేషంగా కృషి చేసిన పుంజాల శివశంకర్‌ను మరో అంబేద్కర్‌గా అభివర్ణించిన ఉగ్గె శ్రీనివాస్ పటేల్, భవిష్యత్తులో తెలంగాణ వ్యాప్తంగా ఆయన విగ్రహాల ఏర్పాటు కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. అలాగే సచివాలయం సమీపంలో, ట్యాంక్‌బండ్‌పై పుంజాల శివశంకర్ విగ్రహం ఏర్పాటు చేయాలని, చీూూూ= లా యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోకాపేటలోని మున్నూరు కాపు ఆత్మగౌరవ భవన నిర్మాణ స్థలంలో ఏర్పాటు చేయనున్న పుంజాల శివశంకర్ చాతి వరకు ఉన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి మున్నూరు కాపు సోదరులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో-కన్వీనర్ డోంగ్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# కారేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్

❑ పెండింగ్ కేసుల త్వరితగతిన పరిష్కారానికి ఆదేశాలు
❑ ప్రజలకు మరింత చేరువయ్యే పోలీసింగ్‌పై దృష్టి

సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్



ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మంగళవారం కారేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల విచారణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణ తీరును పరిశీలించిన కమిషనర్, ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పోలీసింగ్‌ను తీర్చిదిద్దాలని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం స్టేషన్ అధికారులు, సిబ్బందితో సమావేశమైన కమిషనర్ శాఖ పనితీరు మరింత మెరుగుపడేందుకు అవసరమైన పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఏసీపీ తిరుపతి రెడ్డి, కారేపల్లి సీఐ నూనావత్ సాగర్, ఎస్ఐ గోపి తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# దళిత హక్కుల సాధనలో నిరంతర పోరాట యోధుడు మిర్జాపురం చిన్న సాయన్నకు జన్మదిన శుభాకాంక్షలు

కోటగిరి మండలం/, ఆగస్టు 4:/(జన సంఘర్షణ)



అంబేద్కర్ సిద్ధాంతాలను జీవిత లక్ష్యంగా చేసుకుని గత రెండు దశాబ్దాలుగా దళితుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతున్న అంబేద్కర్ వాది, దళిత రత్న అవార్డు గ్రహీత, బాన్సువాడ డివిజన్ మాల సంఘం అధ్యక్షుడు మిర్జాపురం చిన్న సాయన్న జన్మదిన సందర్భంగా సామాజిక, రాజకీయ నాయకులు, మాల సంఘం నాయకులు, అభిమానులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. యాద్గార్‌పూర్ మాజీ సర్పంచ్‌గా పనిచేసిన చిన్న సాయన్న గ్రామాభివృద్ధికి విశేష సేవలందించారు. ఆయన నాయకత్వంలో గ్రామానికి రెండుసార్లు ఉత్తమ గ్రామ అభివృద్ధి పురస్కారాలు లభించడం ఆయన అంకితభావానికి నిదర్శనం. అభివృద్ధితో పాటు సామాజిక న్యాయం, దళితుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి ప్రజల ప్రశంసలు పొందింది. ఎస్సీ వర్గీకరణ అంశంలో కూడా ఆయన కీలక పాత్ర పోషిస్తూ, మాల సంఘం అధ్యక్షుడిగా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న రోస్టర్ పాయింట్--22 విధానం వల్ల మాల వర్గానికి చెందిన నిరుద్యోగ యువత, విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని పలుమార్లు ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, రోస్టర్ విధానంలో తగిన మార్పులు చేయాలని కోరుతూ సభలు, సమావేశాలు నిర్వహించి సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తున్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, దళితుల అభ్యున్నతి కోసం ఆయన చేస్తున్న నిరంతర సేవలు ఆదర్శప్రాయమని పలువురు నాయకులు కొనియాడారు. ఈ సందర్భంగా మిర్జాపురం చిన్న సాయన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, భగవంతుని ఆశీస్సులతో ఆయురారోగ్యాలు, ఆనందం, విజయాలు కలగాలని, మరెన్నో సంవత్సరాలు దళిత సమాజ సేవలో ముందుండి ప్రజలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. జన్మదిన శుభాకాంక్షలు మిర్జాపురం చిన్న సాయన్నకి! జై భీమ్ - జై భారతం! ఆయన పేర్కొన్నారు.

# రామారెడ్డిలో వరదలో చిక్కుకున్న బస్సు..

❑ 45 మంది ప్రయాణికులను కాపాడిన పోలీసులు, ఫైర్ సిబ్బంది

కామారెడ్డి,/ ఆగస్టు 4/(జన సంఘర్షణ):




కామారెడ్డి జిల్లా రామారెడ్డి సమీపంలోని రోడ్డుపై వరద నీటి ఉధృతి కారణంగా ఓ ప్రయాణికుల బస్సు మధ్యలో చిక్కుకుపోయింది. బస్సులో ఉన్న ప్రయాణికులు భయాందోళనకు గురికాగా, సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రోప్ సహాయంతో బస్సులో ఉన్న 45 మంది ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చి, అనంతరం మరో బస్సులో వారి గమ్యస్థానాలకు పంపించారు. అధికారుల వేగవంతమైన స్పందనతో పెను ప్రమాదం తప్పింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలకు కీలక సూచనలు చేస్తూ, వరద నీరు ప్రవహిస్తున్న రహదారులను దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని, అధికారులు జారీ చేసే హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణాలే అత్యంత విలువైనవి. వరదల సమయంలో అప్రమత్తంగా ఉండటం, అధికారుల సూచనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు తెలిపారు.

# మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులదే బాధ్యత

❑ ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ ఆలీ

నిజామాబాద్, /ఆగస్టు 4/(జన సంఘర్షణ):




18 సంవత్సరాలు నిండని మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ ఆలీ సూచించారు. బోధన్ లయన్స్ హాస్పిటల్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాల ముప్పు పెరుగుతుందని, అలాంటి ఘటనల్లో తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. 18 ఏళ్లు నిండకముందు డ్రైవింగ్ చేయడం చట్టవిరుద్ధమని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి మోటారు వాహనాల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, మైనర్ డ్రైవింగ్‌కు సంబంధించిన కేసుల్లో చట్టపరమైన నిబంధనల మేరకు లైసెన్స్ పొందడంపై కూడా ప్రభావం ఉంటుందని వివరించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని విద్యా సంస్థలు తల్లిదండ్రులకు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన అవగాహన పెంపొందించాలని ఆయన కోరారు.

**"పిల్లల భద్రతే కుటుంబ భద్రత ....**

మైనర్ల చేతికి వాహనాల తాళాలు ఇవ్వకండి" అంటూ ఏసీపీ మస్తాన్ ఆలీ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

# ఘోరం.. 30 సెకన్లలో 25 సార్లు కత్తితో పొడిచి లేడీ టీచర్ హత్య

ఫరీదాబాద్ (హర్యానా), /ఆగస్టు 4:/(జన సంఘర్షణ)



హర్యానాలోని ఫరీదాబాద్‌లో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. ఓ ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న సంధ్య (30) అనే మహిళా ఉపాధ్యాయిని అమిత్ (21) అనే యువకుడు అత్యంత దారుణంగా హత్య చేశాడు. పోలీసుల వివరాల ప్రకారం, కేవలం 30 నుంచి 40 సెకన్ల వ్యవధిలోనే మెడ, ఛాతీ, కడుపు భాగాల్లో 25 సార్లు కత్తితో పొడవడంతో సంధ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ దారుణ ఘటన పాఠశాల ప్రాంగణంలో కలకలం రేపింది. మృతురాలు, నిందితుడికి గత రెండేళ్లుగా పరిచయం ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అమిత్ తనను నిరంతరం వేధిస్తున్నాడని సంధ్య గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆ ఫిర్యాదుపై కోపంతోనే ఈ హత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.మహిళలపై వేధింపులు, హింసాత్మక ఘటనలు సమాజానికి మచ్చగా నిలుస్తున్నాయి. ఇటువంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## నల్ల పోచమ్మ ఆలయంలో స్వయంగా బోనం ఎత్తిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ ప్రతినిధి । ఆగస్టు 4/(జన సంఘర్షణ)



ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా బాన్సువాడ పట్టణంలోని నల్ల పోచమ్మ ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఆరే కటిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల మహోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, స్వయంగా బోనం ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, బాన్సువాడ మున్సిపల్ చైర్‌పర్సన్ కాసుల విజయ, పట్టణ ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఆరే కటిక సంఘం సభ్యులు, అమ్మవారి భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేశారు. భక్తుల జయజయధ్వానాలు, సంప్రదాయ వాయిద్యాల నడుమ జరిగిన ఈ బోనాల వేడుక బాన్సువాడ పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపి, భక్తి, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచింది.

## కామారెడ్డి జిల్లా పెద్ద చెరువును ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి ప్రతినిధి/ఆగస్టు 4/(జన సంఘర్షణ)



చంద్ర పోలీస్ బృందంతో చెరువు వద్దకు చేరుకొని పర్యవేక్షించారు. రాత్రి కురిసిన భారీ వర్షానికి పెద్ద చెరువులో భారీ వరద నీరు చేరడంతో పర్యటనకులు ప్రజలు చెరువు వద్ద చూడడానికి వస్తున్నారు. దాంతో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. చెరువు వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఎవరు కూడా చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు. రానున్న మరో మూడు రోజులు భారీ వర్షాలు ఉండడంతో పెద్ద చెరువు వైపు పర్యటకులకు రాకుండా పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర వెల్లడించారు.

## మంజుల పత్తిపాటికి మిత్ర రత్నావళి బిరుదు ప్రదాన సత్కార పత్రం




తెలుగు భాష మాధుర్యాన్ని, తెలుగు సంస్కృతి ఔన్నత్యాన్ని, మన సంప్రదాయాల వైభవాన్ని తన అద్భుతమైన కవితా శిల్పంతో సజీవంగా ఆవిష్కరించి, సాహిత్యరంగంలో విశిష్టమైన సేవలను అందిస్తూ, పాఠక హృదయాలను అలరిస్తున్న మంజుల పత్తిపాటికి హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ స్నేహం అనే పవిత్ర బంధానికి ప్రతీకగా నిర్వహించిన జులై 30 స్నేహితుల దినోత్సవం సందర్భంగా, తెలుగు భాషా-సాంస్కృతిక విలువలను ప్రతిబింబించే స్ఫూర్తిదాయకమైన కవిత్వాన్ని రచించిన మీ సాహిత్య ప్రతిభను, సాంస్కృతిక నిబద్ధతను గౌరవిస్తూ "మిత్ర రత్నావళి" బిరుదును విజయవాడలో ఆగస్టు 2 తేదీ హనుమంతరాయ గ్రంథాలయంలో తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ, ఉషోదయ ఫౌండేషన్ వారు అత్యంత గౌరవంతో ప్రదానం చేయడం జరిగింది.

## రేషన్ కార్డు ఈ-కేవైసీకి ఆగస్టు 31 వరకు గడువు

పోతంగల్/ఆగస్టు 4:/(జన సంఘర్షణ)




తెలంగాణ రాష్ట్రంలోని రేషన్ కార్డు లబ్ధిదారులు ఆగస్టు 31లోపు ఈ-కేవైసీ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ సూచించింది. ప్రతి కుటుంబ సభ్యుడు బయోమెట్రిక్ ధృవీకరణ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని అధికారులు తెలిపారు. అయితే, ఆగస్టు 1 నుంచి మూడు నెలల రేషన్‌ను ఒకేసారి పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మూడు నెలల రేషన్ పంపిణీకి ఈ-కేవైసీ పూర్తై ఉండాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి రేషన్ కార్డు లబ్ధిదారునికి రేషన్ అందజేయనున్నట్లు స్పష్టం చేసింది. అయినప్పటికీ, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు లబ్ధిదారులు ఆగస్టు 31లోపు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## బీర్కూర్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆకస్మిక తనిఖీ

- ఉపాధ్యాయులకు హెచ్చరిక..
- నాణ్యమైన విద్య, 100 శాతం ఫలితాలపై దృష్టి పెట్టాలని ఆదేశం..





బీర్కూర్ । ఆగస్టు 4/(జన సంఘర్షణ)

కామారెడ్డి జిల్లా బీర్కూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందుతున్న తీరును పరిశీలించి, పాఠశాలలో ఉన్న మౌలిక వసతులు, బోధన విధానం, మధ్యాహ్న భోజన నిర్వహణపై సమగ్రంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఆరో తరగతి గదులను సందర్శించిన డీఈఓ విద్యార్థులను నేరుగా ప్రశ్నించి వారి అభ్యాస స్థాయిని పరిశీలించారు. ఆంగ్లంలో చక్కగా సమాధానాలు చెప్పిన విద్యార్థులను అభినందించగా, తెలుగు మాధ్యమంలోని కొందరు విద్యార్థులు చదువులో వెనుకబడి ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని, చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ, పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రతిభను నిరంతరం పర్యవేక్షిస్తూ, బలహీన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల్లో నిర్లక్ష్యం, బోధనలో అలసత్వం సహించబోమని ఉపాధ్యాయులను డీఈఓ హెచ్చరించారు. పాఠశాలలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలపై ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలో మండల విద్యాశాఖ అధికారి వెంకన్న, ఉపాధ్యాయులు కాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## లింగంపల్లి కుర్దులో వంతెన పనులను వేగంగా పూర్తి చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్..

కామారెడ్డి జిల్లా : ఆగస్టు 4 (జన సంఘర్షణ) ప్రతినిధి



కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం లింగంపల్లి కుర్దు గ్రామం వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న తాత్కాలిక వంతెన పునరుద్ధరణ పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వంతెన పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని, భవిష్యత్తులోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వంతెన మరమ్మతులు పూర్తయ్యే వరకు గ్రామస్తుల రాకపోకల కోసం తక్షణమే ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయడంతో పాటు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాణ రక్షణే ధ్యేయంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండి నిరంతరం పరిస్థితులను పర్యవేక్షించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర, ఎల్లారెడ్డి ఆర్డీఓతో పాటు పలు శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## రంగంలోకి దిగిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న..

- కాంగ్రెస్ ప్రభుత్వానికి ఘాటు హెచ్చరిక

హైదరాబాద్ । ఆగస్టు 4/(జన సంఘర్షణ)



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆర్టీసీ అంశాన్ని ప్రస్తావిస్తూ, "ఆర్టీసీతోనే పెట్టుకున్న ప్రభుత్వం ఇప్పటివరకు ఏదీ ముంగట పడలేదు" అని వ్యాఖ్యానించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన ఆయన, ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తే తీవ్ర ప్రజా వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే, "ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పోయే కాలం వచ్చిందని ప్రజలు భావిస్తున్నారు" అని మల్లన్న వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి బ్యూరో./ఆగస్టు 4/(జనసంఘర్షణ)



జిల్లాలో కొనసాగుతున్న భారీ వర్షాల పరిస్థితుల దృష్ట్యా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రాజేష్ చంద్ర ఆధ్వర్యంలో సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వర్షాల పరిస్థితి, చెరువులు, వాగులు, రహదారులు, వంతెనలు, పాత భవనాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితిని సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని చెరువులు, వాగులు, కాలువలు, నీటి ప్రవాహాల వద్దకు ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లరాదని సూచించారు. ముఖ్యంగా యువత, పిల్లలు సెల్ఫీలు తీసుకోవడం, ఈత కొట్టడం లేదా ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిని దాటేందుకు ప్రయత్నించడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అప్రమత్తంగా ఉంచి, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా పర్యవేక్షించాలని కోరారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న లింగంపేట మండలం లింగంపల్లి గ్రామ సమీపంలోని కేకేవై రహదారిపై కిలోమీటర్ 121/2-4 వద్ద చేపట్టిన పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టడంతో ఆ మార్గంలో రాకపోకలు పునరుద్ధరించబడినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని చెరువుల కట్టలు, వంతెనలు, కల్వర్టులు, రహదారులు, పాత భవనాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా ప్రమాదకర పరిస్థితులు తలెత్తిన వెంటనే రక్షణ చర్యలు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చెరువు పూర్తిస్థాయిలో నిండి పొంగిపొర్లుతున్నందున, చెరువు పరివాహక ప్రాంతాలతో పాటు జీఆర్ కాలనీ ప్రజలు, సమీప వార్డుల నివాసితులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అవసరం లేకుండా చెరువు పరిసర ప్రాంతాలకు వెళ్లవద్దని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.జిల్లాలో వర్షాల కారణంగా జరిగిన నష్టాలను కూడా సమీక్షించారు. ఇప్పటివరకు మొత్తం 171 గృహాలు దెబ్బతినగా, వాటిలో 167 గృహాలు పాక్షికంగా, 4 గృహాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అదేవిధంగా 4 చెరువులు దెబ్బతినగా, 32 రహదారులు వివిధ ప్రాంతాల్లో దెబ్బతిన్నట్లు అధికారులు నివేదించారు. నష్టపరిహార అంచనా, పునరుద్ధరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, డిప్యూటీ శిక్షణ కలెక్టర్ రవితేజ, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. మోహన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, ఆర్ అండ్ బి ఈఈ రమేష్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న సదాశివ నగర్ ఎస్సై పుష్పరాజ్

కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ (జన సంఘర్షణ) ప్రతినిధి




మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ పిల్లలకు క్రికెట్ బ్యాట్ అందజేసిన సదాశివ నగర్ ఎస్సై పుష్పరాజ్ బీసీ హాస్టల్ పిల్లలు చెక్క కట్టెతో క్రికెట్ ఆడుతున్నారన్న విషయం తెలుసుకుని తన సొంత ఖర్చుతో క్రికెట్ బ్యాట్ అందజేశారు. అనంతరం పిల్లలకు చదువు భవిష్యత్తు మార్చగలదని క్రీడలు పిల్లల ఆరోగ్యాన్ని విశ్వసాన్ని పెంచుతాయని పిల్లలకు పలు సూచనలు చేశారు పిల్లలు బాగా చదువుకోవాలని క్రమశిక్షణతో ముందుకు సాగాలని సమయం విలువైనది ఆ సమయాన్ని ఉపయోగించుకోవాలని చదువు ఆటపాటలతో తల్లిదండ్రులకు హాస్టల్ కు మంచి పేరు తీసుకురావాలని మొబైల్ ఫోన్ చెడు అలవాటు దానికి దూరంగా ఉండాలని అందరు కలిసి మెలిసి ఉండాలని విద్యార్థులకు చెప్పారు. తమకు సహాయం చేసిన ఎస్ఐ పుష్పరాజుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్‌కు ప్రాతినిధ్యం ఇవ్వాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు
- జర్నలిస్టుల హక్కులకు మరోసారి న్యాయస్థానం అండ
- ఇది టీడబ్ల్యూజేఎఫ్ సభ్యుల విజయం: రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

హైదరాబాద్,/ ఆగస్టు 4:/(జన సంఘర్షణ)
రాష్ట్రంలోని అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల (డీఎంఏసీ)లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)కు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటు విషయంలో గుర్తింపు పొందిన జర్నలిస్టు సంఘాలకు న్యాయబద్ధమైన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరాన్ని హైకోర్టు స్పష్టం చేసింది. అర్హత ఉన్నప్పటికీ టీడబ్ల్యూజేఎఫ్‌కు అక్రెడిటేషన్ కమిటీల్లో ప్రాతినిధ్యం ఇవ్వకుండా ప్రభుత్వం వ్యవహరించడాన్ని సవాల్ చేస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు దాఖలైన రిట్ పిటిషన్‌పై గత ఆరు నెలలుగా పలుమార్లు విచారణ జరిగింది. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ కార్యాలయ న్యాయవాదులు, పిటిషనర్ తరపున న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు, ప్రభుత్వ ఉత్తర్వులు, మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటు విధానం, జర్నలిస్టు సంఘాల ప్రాతినిధ్యానికి సంబంధించిన నిబంధనలను పరిశీలించిన అనంతరం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ మొహినుద్దీన్‌ల ధర్మాసనం సోమవారం తీర్పును వెలువరించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్‌కు కూడా తగిన ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ తీర్పుతో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్‌కు అధికారిక ప్రాతినిధ్యం లభించే మార్గం సుగమమైంది. జర్నలిస్టు సంఘాల మధ్య సమాన అవకాశాలు, పారదర్శకత, న్యాయబద్ధమైన ప్రాతినిధ్యానికి ఈ తీర్పు దోహదపడుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. హైకోర్టు తీర్పును తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించింది. జర్నలిస్టుల హక్కులు, గౌరవం, సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలన్న తమ పోరాటానికి ఇది




న్యాయపరమైన విజయమని పేర్కొంది. ఈ తీర్పును వెంటనే అమలు చేసి, అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ,..“హైకోర్టు తీర్పు టీడబ్ల్యూజేఎఫ్ సభ్యులందరి విజయం. న్యాయం, ధర్మం తమవైపే ఉన్నాయని ఈ తీర్పు మరోసారి నిరూపించింది. భవిష్యత్తులో గుర్తింపు పొందిన అన్ని జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాధాన్యం కల్పించేలా ఈ తీర్పు మార్గదర్శకంగా నిలుస్తుంది” అని పేర్కొన్నారు.

# ఏడేళ్ల బాలికపై లైంగిక దాడి కేసు

- నిందితుడికి కఠిన శిక్ష విధించిన ప్రత్యేక పోక్సో కోర్టు

నిజామాబాద్, ఆగస్టు 4/ (జన సంఘర్షణ):
చిన్నారులపై లైంగిక నేరాలకు పాల్పడేవారిపై చట్టం ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో మరోసారి స్పష్టమైంది. ఏడేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి నిజామాబాద్ ప్రత్యేక పోక్సో కోర్టు కఠిన కారాగార శిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ధర్మవరపు వరూధిని సోమవారం ఇచ్చిన తీర్పు ప్రకారం, నిందితుడు బింగి అంకుష్కు భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) సెక్షన్ 354(డీ) కింద ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా మూడు నెలల జైలుశిక్ష అనుభవించాలని ఆదేశించారు. అదేవిధంగా, పోక్సో చట్టం-2012 సెక్షన్ 7 కింద లైంగిక దాడి నేరానికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల



జరిమానా విధిస్తూ, జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు నెలల అదనపు జైలుశిక్ష విధించాలని కోర్టు పేర్కొంది. ఈ ఘటన 2020 మార్చి 20న నిజామాబాద్ నగరంలోని ఓ కాలనీలో చోటుచేసుకుంది. ఎదురింటిలో నివసిస్తున్న ఏడేళ్ల బాలికపై నిందితుడు అసభ్యంగా ప్రవర్తిస్తుండగా ఓ మహిళ గమనించి కేకలు వేయడంతో అతడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, సమగ్ర విచారణ అనంతరం అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో బాలికతో పాటు సాక్షుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాలను పరిశీలించిన కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారించింది.

**బాధిత బాలికకు రూ.2 లక్షల పరిహారం సిఫార్సు....**

లైంగిక దాడికి గురైన బాలికకు రూ.2 లక్షల పరిహారం అందజేయాలని నిజామాబాద్ జిల్లా న్యాయసేవల అధికార సంస్థకు న్యాయమూర్తి సిఫార్సు చేశారు. జాతీయ న్యాయసేవల ప్రాధికార సంస్థ అమలు చేస్తున్న బాధితుల నష్టపరిహార పథకం కింద ఈ సహాయం అందించనున్నారు. ఈ కేసులో ప్రభుత్వ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరసింహారెడ్డి సమర్థవంతంగా వాదనలు వినిపించారు. చిన్నారులపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై చట్టం కఠిన చర్యలు తీసుకుంటుందని, బాధితులకు న్యాయం చేయడంలో న్యాయస్థానాలు రాజీ పడవని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది.

# ఇకపై ఎంపీడీఓ కార్యాలయంలోనే ‘ప్రజావాణి’..

- నిర్లక్ష్యానికి ఇక చెక్!

హైదరాబాద్/, ఆగస్టు 4/ (జన సంఘర్షణ):
ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి చెక్ పెడుతూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతి సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయంలోనే ‘ప్రజావాణి’ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రణాళిక (వి) శాఖ జీఓ ఎంఎస్ నెం.4ను విడుదల చేసింది. ఉత్తర్వుల ప్రకారం ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించబడుతుంది. ఎంపీడీఓ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్, ఎంపీఓ, వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్థక, మత్స్య, విద్య, వైద్య, ఐసీడీఎస్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ, హౌసింగ్, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, విద్యుత్, మున్సిపల్ తదితర 23 శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాల్సిందే. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును స్వీకరించి, వెంటనే పరిష్కార చర్యలు ప్రారంభించాల్సి ఉంటుంది. ప్రతి ఫిర్యాదును ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి, ఫిర్యాదు ఐడీతో కూడిన రసీదును అందజేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే ప్రతి కేంద్రంలో కంప్యూటర్, స్కానర్, ఇంటర్నెట్ సౌకర్యాలతో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, చిన్నారులతో వచ్చిన మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

**అధికారులకు స్పష్టమైన హెచ్చరిక:...**


ప్రజావాణి నిర్వహణలో నిర్లక్ష్యం, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేదా ప్రజల పట్ల అలసత్వం ప్రదర్శిస్తే సంబంధిత అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఈ ఉత్తర్వులు




స్పష్టం చేస్తున్నాయి. ప్రజలకు వేగవంతమైన సేవలు, పారదర్శక పరిపాలన, అధికారుల జవాబుదారీతనాన్ని పెంపొందించడమే ఈ నిర్ణయం ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం వెల్లడించింది.


# కరెంటు షాక్‌తో మృతి చెందిన వానరానికి ఘనంగా అంత్యక్రియలు నిర్వహించిన గ్రామస్థులు

బోధన్ ప్రతినిధి । ఆగస్టు 4/(జన సంఘర్షణ)
బోధన్ మండలం కల్దుర్కి గ్రామ శివారులోని ఓ పంట పొలంలో కరెంటు షాక్‌కు గురై మంగళవారం ఒక వానరం మృతి చెందింది. ఈ ఘటన గ్రామస్థులను తీవ్రంగా కలచివేసింది. మృత వానరానికి గ్రామ యువకులు, స్థానికులు హిందూ సంప్రదాయం ప్రకారం గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు. ముందుగా పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం గ్రామ సమీపంలో ఖననం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. మూగజీవాల పట్ల ప్రేమ, దయ, కరుణ చూపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. జంతువులు కూడా ప్రకృతిలో అంతర్భాగమేనని, వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. “మూగజీవాల పట్ల మానవత్వం చూపిన కల్దుర్కి గ్రామస్థుల చర్య అందరికీ ఆదర్శప్రాయం” అంటూ స్థానికులు అభినందించారు. ఈ ఘటన జీవరాశుల పట్ల ప్రేమ, కరుణ, బాధ్యతను చాటిచెప్పే మంచి సందేశంగా నిలిచింది.



## పొతంగల్ మండల ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు

పొతంగల్, /ఆగస్టు 4/(జన సంఘర్షణ)





బోనాల పండుగ సందర్భంగా పొతంగల్ మండల ప్రజలకు, అలాగే పరిసర గ్రామాల ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ పొతంగల్ మండల బీజేపీ డైనమిక్ లీడర్ పబ్బ శేఖర్ శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దివ్య ఆశీస్సులు ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆనందాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. బోనాల పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఈ పవిత్ర వేడుకను భక్తిశ్రద్ధలతో, సామరస్య వాతావరణంలో ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పొతంగల్ మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలందరికీ మరోసారి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి కృప ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

## వర్షానికి కొట్టుకొచ్చిన కొమ్మలు తొలగింపు !

- బూర్గుల్ సర్పంచ్ సౌమ్య మోహన్


కామారెడ్డి జిల్లా: గాంధారి మండలం :ఆగస్టు 4 (జన సంఘర్షణ)ప్రతినిధి



వరద ప్రవాహానికి ఈదుల వాగు దగ్గరికి కొట్టుకు వచ్చిన చెట్లను తక్షణమే తొలగించిన బూర్గుల్ సర్పంచ్ సౌమ్య మోహన్ ఉత్నూర్ నుంచి గాంధారి వెళ్లే ప్రధాన రహదారి వెంబడి ఈదుళ్ళ వాగు వర్ష ప్రభావం కి పొంగి పొర్లి చెట్ల కొమ్మలతో రోడ్డు మార్గాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న బూర్గుల్ సర్పంచ్ వెంటనే స్పందించి జెసిబి సహాయంతో వరద ప్రవాహానికి కొట్టుకు వచ్చిన కొమ్మలను తొలగించి గాంధారి నుంచి ఉత్తనూర్ దారిని క్లియర్ చేయించారు వెంటనే స్పందించిన సర్పంచ్ సౌమ్య మోహన్ కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## పొతంగల్ గ్రామ ప్రజలకు పోచమ్మ వారి బోనాల పండుగ శుభాకాంక్షలు

పొతంగల్/, ఆగస్టు 4/:




పొతంగల్ గ్రామ ప్రజలకు, అలాగే పరిసర ప్రాంతాల ప్రజలందరికీ పోచమ్మ వారి బోనాల పండుగ సందర్భంగా రజక సంఘం అధ్యక్షుడు మేత్రీ శివరాజ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత...పోచమ్మ తల్లి కటాక్షం ప్రతి ఇంటిపై ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకొని సామరస్యాన్ని, సోదరభావాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అమ్మవారి దివ్య ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, అభివృద్ధి వెల్లివిరియాలని కోరుతూ మరోసారి పొతంగల్ గ్రామ ప్రజలకు మరియు పరిసర ప్రాంతాల ప్రజలందరికీ పోచమ్మ వారి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రభుత్వ రాజముద్రతో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు

చిత్తూరు ఆగస్టు 4 (జనసంఘర్షణ)
రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతుల భూములకు సంబంధించి పట్టా పాస్ పుస్తకాలను ప్రభుత్వ రాజముద్రతో అందిస్తోందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. మంగళవారం గుడిపాల మండలం దిగువ కొండాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు పట్టా పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పాలకులు రైతుల భూమికి సంబంధించిన పట్టా పాస్ పుస్తకాలపైనా వారి ఫోటోలు పెట్టుకున్నారని.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ రాజ్యముద్రతో పాస్ పుస్తకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో రైతులకు అన్ని విధాలుగా మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా భూ సమస్యలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శిరీష, ఎంపీపీ గోళ్ల హరి, మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బానాయుడు, చిత్తూరు నియోజకవర్గ పరిశీలకులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం — తెలుగు దినపత్రిక
బుధవారం
05 ఆగస్టు 2026

# సీఎం ప్రజావాణిలో కొత్తగా మీ-సేవా కేంద్రం ఏర్పాటు..

- ◆ ప్రారంభించిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి
- ◆ ప్రజలకు మరింత చేరువలో ప్రభుత్వ సేవలు




హైదరాబాద్,/ ఆగస్టు4/(జన సంఘర్షణ)
రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా అందించేందుకు సీఎం ప్రజావాణిలో కొత్తగా ఏర్పాటు చేసిన మీ-సేవా కేంద్రాన్ని సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ ఆఫీసర్ కే. విద్యాసాగర్, మీ-సేవా డైరెక్టర్ రవి కిరణ్ మంగళవారం జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా సీఎం ప్రజావాణికి వచ్చే ప్రజలకు వివిధ ప్రభుత్వ సేవలను ఒకేచోట అందించాలనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందిరమ్మ డబుల్ బెడ్‌రూమ్ గృహాల కోసం దరఖాస్తులు, వివిధ శాఖలకు సంబంధించిన ధృవపత్రాలు, ఇతర ప్రభుత్వ సేవల కోసం దరఖాస్తులు సమర్పించేందుకు ఈ మీ-సేవా కేంద్రం ఎంతో ఉపయోగపడనుంది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని దాదాపు అన్ని శాఖల సేవలు ఇప్పుడు సీఎం ప్రజావాణిలోనే అందుబాటులోకి వచ్చాయి.

**సీఎం ప్రజావాణికి 321 దరఖాస్తులు**

మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణిలో మొత్తం 321 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ దరఖాస్తులను స్వీకరించి, వాటిపై ఎండార్స్ చేస్తూ సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

**శాఖల వారీగా అందిన దరఖాస్తులు:..**

- పంచాయతీరాజ్ ఉ గ్రామీణాభివృద్ధి శాఖ -- 144
- రెవెన్యూ శాఖ -- 51
- హోంశాఖ -- 25
- ప్రవాసి ప్రజావాణి -- 2
- ఇతర శాఖలు -- 99..

ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న కంటిన్జెన్సీ ఉద్యోగులు తమకు బకాయి ఉన్న 18 నెలల వేతనాలను విడుదల చేయాలని వినతిపత్రం సమర్పించారు. దీనిపై వెంటనే స్పందించిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి డీజీపీ సీవీ ఆనంద్తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించి, ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ఉమేందర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎన్నారై సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీమ్‌రెడ్డి, సమన్వయకర్త బొజ్జ అమరేందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ కథనాన్ని పత్రికా ప్రచురణకు అనువుగా శీర్షికలు, ఉపశీర్షికలతో రూపొందించాను. అవసరమైతే ఇంకా సంక్షిప్తంగా లేదా బ్యానర్ వార్త రూపంలో కూడా సిద్ధం చేయగలను.

# మద్నూర్‌లో భక్తిశ్రద్ధలతో బోనాల మహోత్సవం

- ◆ అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందిన భక్తులు...

మద్నూర్,/ ఆగస్టు 4 /(జన సంఘర్షణ):
కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలో మంగళవారం బోనాల మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మున్నూరు కాపు, పద్మశాలి, శింపి తదితర వివిధ సామాజిక వర్గాలకు చెందిన మహిళలు, పురుషులు డప్పులు, వాయిద్యాల నడుమ పోతరాజుల నృత్యాలతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల సందర్భంగా మహిళలు వండిన అన్నం, పాలు, బెల్లం, వేపాకులతో అలంకరించిన మట్టి కుండలను తలపై మోసుకుని, వాటిపై వెలిగించిన దీపాలతో అమ్మవారికి సమర్పించారు. ఈ బోనం దేవత పట్ల భక్తి, కృతజ్ఞతలకు ప్రతీకగా భావిస్తారని భక్తులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామదేవతకు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆమె ఆశీస్సులు పొందారు. భక్తుల జయజయధ్వానాలు, డప్పుల మోతలు, పోతరాజుల విన్యాసాలతో మద్నూర్ గ్రామం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. బోనాల మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగగా, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, వివిధ సామాజిక వర్గాల నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో



డాక్టర్ బండి విజయ్ సతీమణితో పాటు పలువురు ఆడపడుచులు, మహిళా భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

# తెలంగాణ సామాజిక న్యాయం సంకల్ప సభను విజయవంతం చేయండి

- ◆ తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకురాలు కవితమ్మ పిలుపు...

జుక్కల్, /ఆగస్టు 4:/(జన సంఘర్షణ)
తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకురాలు కవితమ్మ నాయకత్వంలో నిర్వహించనున్న తెలంగాణ సామాజిక న్యాయం సంకల్ప సభను విజయవంతం చేయాలని జుక్కల్ నియోజకవర్గ నాయకుడు బొర్గి సంజీవ్ పిలుపునిచ్చారు. ఈ నెల ఆగస్టు 6వ తేదీన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరగనున్న ఈ మహాసభకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు, నిరుద్యోగ యువత, టీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు, కవితమ్మ గారి అభిమానులు, మీడియా మరియు సోషల్ మీడియా ప్రతినిధులు, పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు, టీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. తెలంగాణలో



సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సంకల్ప సభకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని తమ మద్దతు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.
విజ్ఞప్తి:....
తెలంగాణ ప్రజలందరూ పెద్ద ఎత్తున విచ్చేసి తెలంగాణ సామాజిక న్యాయం సంకల్ప సభను విజయవంతం చేయాలని బొర్గి సంజీవ్ కోరారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# బోనాల పండుగ సందర్భంగా పోతంగల్ గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు



పోతంగల్/ ఆగస్టు 4/(జన సంఘర్షణ)
బోనాల పండుగ సందర్భంగా పోతంగల్ గ్రామ ప్రజలందరికీ మాజీ ఎంపీటీసీ కేశ వీరేశం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పవిత్ర పండుగ పోతంగల్ గ్రామంలో ఐకమత్యం, సోదరభావం, సామరస్యం మరింత బలపడేలా చేయాలని, గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంజు వడ్ల, మంగలి శంకర్, బస్వంత్, పండరి, సాయిలు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రిలో డాక్టర్‌పై దాడి..

- ◆ వైద్య వృత్తిలో కమీషన్ల కలకలం

బోధన్/ఆగస్ట్ 4/(జన సంఘర్షణ)



బోధన్ పట్టణంలో చోటుచేసుకున్న ఓ ఘటన వైద్య వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అంబులెన్స్ డ్రైవర్‌కు ఇవ్వాల్సిన కమీషన్ విషయంలో వివాదం తలెత్తడంతో, సదరు డ్రైవర్ ఆస్పత్రికి వెళ్లి డాక్టర్‌ను కాలర్ పట్టుకుని బయటకు లాగి దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనతో వైద్య సేవల్లో కమీషన్ వ్యవహారాలు, బ్రోకరేజ్ సంస్కృతిపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రాణాలను కాపాడాల్సిన పవిత్రమైన వైద్య వృత్తిలో ఇలాంటి ఆరోపణలు, ఘర్షణలు చోటుచేసుకోవడం సమాజానికి ఆందోళన కలిగించే అంశమని పలువురు అభిప్రాయపడుతున్నారు.
హెచ్చరిక: వైద్య సేవలు ప్రజల విశ్వాసంపై నిలబడే వ్యవస్థ. కమీషన్ల కోసం రోగులను వ్యాపార వస్తువులుగా చూడడం ఎంత తప్పో, అదే విధంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులకు పాల్పడడం కూడా తీవ్రమైన నేరం. ఆరోగ్య రంగంలో పారదర్శకత, నైతిక విలువలు పాటించడంతో పాటు, వివాదాలను చట్టబద్ధ మార్గాల్లోనే పరిష్కరించాలి. లేనిపక్షంలో ప్రజల విశ్వాసం దెబ్బతిని, వైద్య వ్యవస్థ ప్రతిష్ఠకు తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉంది.

# వర్నిఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబాకు ఘన సన్మానం

వర్ని, /ఆగస్టు 4:



ఉమ్మడి వర్ని మండలంలో కాంగ్రెస్ పార్టీ మూడు దశాబ్దాల విజయవంతమైన ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబాకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సేవకు సురేష్ బాబా అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని నాయకులు కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సురేష్ బాబాకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ◆ సిద్ధాపూర్ సర్పంచ్ వివరణ





బోధన్ సిద్ధాపూర్/ఆగస్టు 4/(జన సంఘర్షణ)
సిద్ధాపూర్: గ్రామంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనానికి పంచాయతీ ట్రాక్టర్‌తో ఇసుకను సర్పంచ్ సరఫరా చేశారంటూ జరుగుతున్న ప్రచారంపై సిద్ధాపూర్ గ్రామ సర్పంచ్ స్పందించారు. సర్పంచ్ తెలిపిన వివరాల ప్రకారం, ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వ్యక్తులు ఇసుకను పోసి వెళ్లిపోవడంతో పాఠశాల బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని తన నైతిక బాధ్యతగా పంచాయతీ ట్రాక్టర్, సిబ్బందితో ఆ ఇసుకను తొలగించి, డంపింగ్ యార్డుకు కాకుండా తాత్కాలికంగా నూతన గ్రామ పంచాయతీ భవనం ముందు ఖాళీ స్థలంలో వేయించామని వివరించారు. ఈ చర్యను వక్రీకరించి తనపై తప్పుడు ప్రచారం చేయడం బాధాకరమని, వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సరికాదని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామస్థులు నిజానిజాలను అర్థం చేసుకుని సహకరించాలని కోరారు. అయితే గ్రామాల్లో అక్రమ ఇసుక రవాణా, నిల్వలు, ఇసుక మాఫియా కార్యకలాపాలపై రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖలు సంయుక్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా ఆస్తులను, ప్రభుత్వ పనులను అక్రమ ఇసుక వ్యవహారాలతో ముడిపెట్టి అపోహలు సృష్టించే వారిపైనా అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం

- నారాయణవనం సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతల పిలుపు

**నారాయణవనం ఆగస్టు 4 (జనసంఘర్షణ)**




సత్యవేడు నియోజకవర్గంలోని నారాయణవనంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల పార్టీ ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.సమావేశంలో డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో పార్టీ చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఉద్యమ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న ముఖ్య నేతల సమావేశాలు, రిలే నిరాహార దీక్షలు, మహా ధర్నాలను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు.ప్రతి మండలం, గ్రామం, వార్డు స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి డీఎస్సీ అంశంపై విస్తృత అవగాహన కల్పించాలని, డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగ యువత, ప్రజలు ఉద్యమ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డీఎస్సీ అభ్యర్థుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి బలంగా తీసుకెళ్లేలా ఉద్యమాన్ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మీడియా దృష్టిని ఆకర్షించిన అద్భుత కుటీర పరిశ్రమ...

**వరదయ్యపాలెం(జనసంఘర్షణ):**






వరదయ్యపాలెం, సత్యవేడు, బుచ్చినాయుడు కండ్రిగ, తడ మండలాల ప్రజలకు ముఖ్యంగా అక్కడి స్థానిక వ్యాపారస్తుల మరియు చిరు వ్యాపారస్తుల క్యాటరింగ్, హోటల్స్ నడిపే వారికి విజ్ఞప్తి... శ్రీకృష్ణాజి సంకల్పం... మహిళా స్వయం ఉపాధి కల్పన.. దానికి తోడ్పాటును అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత. శ్రీ అమ్మ భగవాన్ ఏకం ఆశ్రమ నికి చెందిన లోకా ఫౌండేషన్ చేయూతతో వరదయ్యపాలెం మండలం కాంబాకం లో మహిళా స్వయం ఉపాధి సంకల్పంతో విస్తరాకుల ప్లేట్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటుచేసి దాని ద్వారా స్థానిక మహిళలకు అద్భుత ఉపాధి అవకాశం కల్పించారు. దీనిని ప్రజలు స్థానిక వ్యాపారస్తులు, హోటల్స్ వారి సంఘాలు గమనించి వారికి తోడ్పాటు అందించి వారి వ్యాపారాభివృద్ధికి సహకరించాలని... మనవి. ప్లాస్టిక్ ప్లేట్స్ ప్లాస్టిక్ వస్తువులు వాడడం ఎంత ప్రమాదకరమో పర్యావరణానికి ప్రతి ఒక్కరికి తెలిసిన విషయమే... ఇస్తరాకుల ప్లేట్స్ తయారీకి మారిన కాలానుగుణంగా అత్యాధునిక పరికరాలు కొనుగోలు చేసి దాన్ని ఎలా వాడాలో ప్రత్యేకంగా హైదరాబాద్కు తీసుకొని వెళ్లి శిక్షణ ఇప్పించారని అందులో పని చేస్తున్న అక్క చెల్లెమ్మలు తెలపడం విశేషం...మన అక్క చెల్లెమ్మలు గతంలో రైతు కూలీలుగా ఉపాధి కూలీలుగా వలస కూలీలుగా తరతరాలుగా జీవనం సాగించిన వీరి తలరాత మార్చడానికి సంకల్పించిన కృష్ణాజీ సంకల్పానికి ప్రతి ఒక్కరూ చేయి చేయి కలపడం మన సామాజిక బాధ్యత..స్థానిక మండలాల నుండి వీరికి తోడ్పాటు ఎంతో అవసరం ప్రజలు తమ శుభకార్యాలకు ఇతర కార్యక్రమాలకు ముఖ్యంగా వ్యాపారస్తులు చిరు వ్యాపారస్తులు వీరికి చేయూతను అందించడం అత్యంత కీలకమైన అంశం...

# కుప్పంలో ఇస్కాన్ ఆలయ నిర్మాణానికి ప్రతిపాదిత స్థలాల పరిశీలన

**కుప్పం, ఆగస్టు 04 (జనసంఘర్షణ):**

కుప్పం నియోజకవర్గంలో ఇస్కాన్ టెంపుల్ నిర్మాణానికి గాను పలు ప్రదేశాలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు . మంగళవారం కుప్పం నియోజకవర్గంలోని పెద్దబంగారు నత్తం, బేవనపల్లి రెవెన్యూ విలేజ్ పరిసర ప్రాంతాల్లో ఇస్కాన్ నిర్మాణానికి ప్రతిపాదించిన భూములను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ కడా వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్. చైర్మన్ పి.ఎస్ మునిరత్నం, ఇస్కాన్ ప్రతినిధులతో కలిసి ప్రతిపాదిత స్థలాలను సందర్శించి, ఆలయ నిర్మాణానికి అనువైన పరిస్థితులు, భూమి విస్తీర్ణం, చేరుకునే మార్గాలు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు తదితర అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కుప్పం రూరల్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజగోపాల్, ఇస్కాన్ టెంపుల్ వారు తదితరులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను నిబంధనల మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.



# భారత ఉపరాష్ట్రపతిని మర్యాద పూర్వకంగా కలసిన ఏపి కూటమి ఎంపీల బృందం

- ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌కు “అమరావతి” పుస్తక ప్రతి అందజేతలి
- ఏపీ సీఎం చంద్రబాబు దూరదృష్టిప్రజలకు వరమని కొనియాడిని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావులి

**చిత్తూరు (న్యూఢిల్లీ) (జనసంఘర్షణ)**



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూర దృష్టి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వరమని కొనియాడారు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు. మంగళవారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలుగు దేశం పార్టీ పార్లమెంటరీ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు నేతృత్వంలో తన సహచర ఎంపిల బృందంతో కలసి..భారత ఉపరాష్ట్రపతి గౌరవనీయ సి.పి. రాధాకృష్ణన్ను.., ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా “అమరావతి: ప్రజలచే నిర్మించబడింది, విధిచే రక్షించబడింది” అనే కాఫీ టేబుల్ బుక్ ప్రతిని ఉపరాష్ట్రపతికి అందజేసినట్లు చిత్తూరు ఎంపీ దగ్గమళ్ళ ప్రసాదరావు చెప్పారు. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం, రైతులు–మహిళలు సాగించిన 1,631 రోజుల పోరాటం, అలాగే 2024 జూన్ 2 నుండి అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగాపునరుద్ధరించిన చారిత్రక నిర్ణయం వంటి అంశాలను ఈ పుస్తకం కళ్ళకు కట్టినట్లు వివరిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి గల సమర్థవంతమైన నాయకత్వంలో, ఎన్డీఏ ప్రభుత్వ సహకారంతో అమరావతిని ప్రజల ఆకాంక్షల మేరకు ప్రపంచ స్థాయి రాజధానిగా, సంపద సృష్టి, ఆవిష్కరణ, ఆధునిక సాంకేతికతకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మన ఆంధ్రప్రదేశ్ కూటమి ఎంపిల బృందం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు.

# శ్రీశక్తి మారియమ్మ జాతరలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

**చిత్తూరు ఆగస్టు 4 ((జనసంఘర్షణ)**



చిత్తూరు నగరపాలక పరిధిలో 5వ వార్డు రఘురాం నగర్ కాలనీలో వెలసిన శ్రీ శక్తి మారియమ్మ నడి వీధి గంగమ్మను ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ దర్శించుకున్నారు. శ్రీ శక్తి మారియమ్మ ఆడి జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నడివీధిలో ప్రతిష్టించిన అమ్మవారిని ఎమ్మెల్యే, నాయకులతో కలిసి దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు గజమాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. పూజల అనంతరం స్థానిక నాయకులు, జాతర కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే, ఇతర ముఖ్య నాయకులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, రాజేష్ రెడ్డి, రాజశేఖర్, సీకే లావణ్య, ఈశ్వరరావు, నళిని, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా కూటమి ప్రభుత్వ పాలన

- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

**చిత్తూరు ఆగస్టు 4 (జనసంఘర్షణ)**



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. మంగళవారం గుడిపాల మండలం శ్రీరంగంపల్లి గ్రామ పంచాయతీ దిగువ కొండాపురం గ్రామంలో “రెండేళ్ల ప్రభుత్వ పాలన ఇంటింటి ప్రచారం” కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మంచి పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో తెదేపా పరిశీలకులు కుమారి, మండల పార్టీ అధ్యక్షుడుసుబ్బానాయుడు, ఉపాధ్యక్షుడు ధన సింగ్, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం యాదవ్, ఎంపీపీ గోళ్ల హరి, కూటమి నాయకులు సీకే లావణ్య, ప్రతాప్ నాయుడు, రూప్ కుమార్, లీలావతి, స్థానిక గ్రామ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ రాజముద్రతో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు

- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

**చిత్తూరు ఆగస్టు 4 (జనసంఘర్షణ)**



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతుల భూములకు సంబంధించి పట్టా పాస్ పుస్తకాలను ప్రభుత్వ రాజముద్రతో అందిస్తోందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. మంగళవారం గుడిపాల మండలం దిగువ కొండాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు పట్టా పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పాలకులు రైతుల భూమికి సంబంధించిన పట్టా పాస్ పుస్తకాలపైనా వారి ఫోటోలు పెట్టుకున్నారని.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ రాజ్యముద్రతో పాస్ పుస్తకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో రైతులకు అన్ని విధాలుగా మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా భూ సమస్యలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శిరీష, ఎంపీపీ గోళ్ల హరి, మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బానాయుడు, చిత్తూరు నియోజకవర్గ పరిశీలకులు కుమారి, కూటమి నాయకులు సీకే లావణ్య, ధనసింగ్,బాలసుబ్రహ్మణ్యం యాదవ్, ప్రతాప్ నాయుడు, బాలాజీ నాయుడు, రూప్ కూమార్, లీలావతి, పీటర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.తాగునీటి సమస్యను పరిష్కరించిన ప్రజా ప్రతినిధులు గుంటూరు మురళి చంద్రమౌళి.

# తాగునీటి సమస్యను పరిష్కరించిన ప్రజా ప్రతినిధులు గుంటూరు మురళి చంద్రమౌళి

**పూతలపట్టు జూలై 4 (జనసంఘర్షణ)**



చెప్పిన మాటకు కట్టుబడిన ప్రభుత్వమే తెలుగు దేశం ప్రభుత్వం యొక్క లక్ష్యమని పూతలపట్టు తెలుగుదేశం పార్టీ నాయకులు గుంటూరు మురళి.చంద్రమౌళి తెలిపారు. మంగళ వారం పూతల పట్టు మండలం బత్తల వారి పల్లి గ్రామాన్ని మండల అభివృద్ధి అధికారి నాగరాజు పంచాయతీ కార్యదర్శి ప్రతాప్రాజ్ గ్రామంలో పర్యటించారు ఇందులో భాగంగా బత్తలవారి పల్లి గ్రామస్తులు గ్రామం నందు బోరు ఉందని అందులో తాగడానికి నీళ్లు కూడాఉన్నాయని హై పవర్ మోటర్ అమార్చితే తాగడానికి నీళ్లకు ఇబ్బంది లేకుండా ఉంటుందని గ్రామస్తులు నాయకులను అధికారులను కోరారు. దీనికి స్పందించిన అధికారులు నాయకులు వెంటనే గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పవర్ మోటార్ను అమర్చి తాగునీటి సమస్య లేకుండా పరిష్కారం చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. తాగునీటిసమస్యను పరిష్కారం చేసిన ప్రజాప్రతినిధులకు అధికారులకు గ్రామస్తులు గ్రామస్తులు అభినందన తెలియజేశారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co